# సుప్రీంలో టెల్కోలకు షాక్

## వొడాఫోన్, ఎయిర్‌టెల్, టాటా టెలీ పిటిషన్లను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం




న్యూఢిల్లీ, మే 19: సుప్రీం కోర్టులో టెలికాం సంస్థలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిలను రద్దు చేయాలని వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ దాఖలు చేసిన పిటిషన్లను సోమవారం అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. జేబీ పర్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. టెల్కోల అభ్యర్థనలను తోసిపుచ్చుతూ అదంతా ఏమీ కుదరదని తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే ఈ పిటిషన్లను భారీ తప్పిదంగా అభివర్ణిస్తూ ఒకింత ఘాటుగా టెలికాం కంపెనీలను న్యాయమూర్తులు మందలించడం గమనార్హం.

**ఇది సరికాదు**

'ఇలాంటి పిటిషన్లు మా ముందుకు రావడంపై మేము నిజంగా దిగ్భ్రాంతికి గురయ్యాం. ఈ అభ్యర్థనలు మమ్మల్ని ఎంతో అసౌకర్యానికి లోనుచేశాయి. ముఖ్యంగా ఓ బహుళజాతి సంస్థ (వొడాఫోన్) నుంచి ఈ తరహా పిటిషన్ వస్తుందని మేము అస్సలు ఊహించలేదు. దీన్ని మేము కొట్టివేస్తున్నాం' అంటూ వొడాఫోన్ తరపున ఈ కేసులో వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగీతో సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేగాక ఈ అంశంలో టెలికాం సంస్థలకు సహాయం చేసేలా ప్రభుత్వానికి ఏ రకంగా అడ్డు రాబోమని కూడా స్పష్టం చేసింది. నిజానికి జూలైదాకా ఈ కేసును వాయిదా వేయాలని రోహ్తగీ విచారణ సందర్భంగా కోర్టును కోరారు. అయితే అందుకు కారణాన్ని కోర్టు చెప్పాలనడంతో.. ఈ సమస్యకు పరిష్కారం కోసం కోర్టు వెలుపల ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ, వొడాఫోన్ ఐడియాలో దాదాపు 50 శాతం భారత ప్రభుత్వానికి వాటా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. దీంతో 'ఒకవేళ ప్రభుత్వం మీకు సాయం చేయాలనుకుంటే చేసుకోవచ్చు. అందుకు మేము అడ్డురాము. కాబట్టి ఇక ఈ కేసులో వాయిదాలకు తావులేదు' అంటూ అన్ని పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. చివరకు పిటిషన్ ఉపసంహరణకూ అంగీకరించలేదు. కాగా, 2021 జూలైలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఈ విషయంలో సాయానికి కేంద్ర ప్రభుత్వానికి వీల్లేకుండాపోతున్నదని రోహ్తగీ వాదించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఏజీఆర్ బకాయిల లెక్కింపులో లోపాలున్నాయని, వాటిని సరిచేసేందుకు అవకాశమివ్వాలని టెల్కోలు కోరగా.. 2021 జూలై 23న సుప్రీం కోర్టు తోసిపుచ్చిన విషయం తెలిసిందే.

**షేర్ విలువ ఢమాల్**

సుప్రీం తీర్పుతో స్టాక్ మార్కెట్లలో వొడాఫోన్ ఐడియా షేర్ విలువ తీవ్రంగా నష్టపోయింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి టెలికాం కార్యకలాపాలను భారంగా నడుపుతున్న వొడాఫోన్ ఐడియాకు ఏజీఆర్ బకాయిల విషయంలో కూడా ఊరట లభించకపోవడంతో మదుపరులు అమ్మకాలకు దిగారు. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే 8.41 శాతం మేర సంస్థ షేర్ విలువ దిగజారింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో రూ.6.75గా ఉన్నది. ఒకానొక దశలోనైతే 12 శాతం నష్టపోవడం గమనార్హం. ఎయిర్‌టెల్ షేర్ విలువ కూడా స్వల్పంగా 0.14 శాతం లాభానికే పరిమితమైంది. కాగా, ప్రభుత్వం తమకు సాయం చేయకపోతే ఇక ఎంతోకాలం టెలికాం సేవలను నడుపలేమని ఇటీవలే వొడాఫోన్ ఐడియా హెచ్చరించిన విషయం తెలిసిందే. పైగా తమ కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నదని, ఒకవేళ తాము దివాలా తీస్తే.. సదరు వాటా విలువ సున్నాగా మారిపోతుందని స్పష్టం చేసింది. అంతేగాక ఇప్పటికే ఈక్విటీలోకి మారిన రూ.1.18 లక్షల కోట్ల స్పెక్ట్రమ్ బకాయిలు వసూలుకావన్నది. కాబట్టి తమకు సాయం చేయాల్సిందేనని ఒక రకంగా మోదీ సర్కారును వొడాఫోన్ ఐడియా హెచ్చరించడం గమనార్హం.

### ఇదీ సంగతి..

*వొడాఫోన్ ఏజీఆర్ బకాయిలు దాదాపు రూ.30,000 కోట్లుగా ఉన్నాయి. వీటిలో వడ్డీ, జరిమానా, వడ్డీపై జరిమానా వంటివి ఉన్నాయి. ఇక ప్రస్తుతం సుప్రీంలో వేసిన పిటిషన్ గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కాదు. ఈ బకాయిల రద్దు కోసం మాత్రమే. అయితే బకాయిలు చెల్లించడానికి సంబంధించిన వాయిదాల కాలానికి సైతం వడ్డీ చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం పట్టుబట్టకుండా చొరవ తీసుకోవాలని సుప్రీంను ఈ పిటిషన్‌లో వొడాఫోన్ కోరింది. కానీ ఇవేవీ నెరవేరలేదు. ఇక దేశంలో ఉన్న మూడు ప్రైవేట్ రంగ టెలికాం సంస్థల్లో వొడాఫోన్ ఐడియా కూడా ఒకటి. మొత్తం మార్కెట్‌లో 18 శాతం వాటా దీనిదే. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ హెక్సా.. వడ్డీ, జరిమానాలకు సంబంధించి రూ.34,745 కోట్లను రద్దు చేయాలని సుప్రీంను తమ పిటిషన్‌లో అభ్యర్థించింది. 2020 సెప్టెంబర్ 1న ఏజీఆర్ బకాయిలకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు యావత్తు భారతీయ టెలికాం రంగాన్నే ఆర్థికంగా కుదిపేసిందని కూడా పేర్కొన్నది. అయినప్పటికీ కోర్టు తీర్పును సవాల్ చేయలేదని గుర్తుచేస్తూ.. వడ్డీలు, జరిమానాల నుంచి ఊరట కల్పించాలని మాత్రమే కోరుతున్నట్టు వివరించింది. అయినా ఫలితం లేకపోయింది. టెలికాం శాఖకు చెల్లించాల్సిన మొత్తం రూ.93,520 కోట్ల ఏజీఆర్ బకాయిల్లో 10 శాతం 2021 మార్చి 31కల్లా టెలికాం సంస్థలు చెల్లించాలని, 2031 మార్చి 31లోగా ఆ మిగతా 90 శాతం బకాయిలను వార్షిక వాయిదాలుగా చెల్లించాలని 2020 సెప్టెంబర్‌లో సుప్రీం తీర్పునిచ్చిన సంగతి విదితమే.*

## హోండా రెబల్ 500 బైక్

ధర రూ.5.12 లక్షలు



న్యూఢిల్లీ, మే 19: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా..మరో స్పోర్ట్ బైకును పరిచయం చేసింది. రెబల్ 500 క్రూజర్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.5.12 లక్షలుగా నిర్ణయించింది. 471 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ట్విన్ ఇంజిన్, ఆరు గేర్‌బాక్స్, ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ బైకును బుకింగ్ చేసుకున్న వారికి వచ్చే నెల చివరి నుంచి డెలివరి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ బైకు గురుగ్రామ్, ముంబై, బెంగళూరులలో ఉన్న బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల్లో మాత్రమే లభించనున్నది.

## నయా హ్యుందాయ్ ఐ20

### ప్రారంభ ధర 7.50 లక్షలు



న్యూఢిల్లీ, మే 19: దేశీయ మార్కెట్‌కు నయా ఐ20 మాడల్‌ను పరిచయం చేసింది హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్. దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ రకం ఈ మాగ్నా ఎగ్జిక్యూటివ్ ప్రారంభ ధర రూ.7.50 లక్షలుగా నిర్ణయించింది. ఆరు రకాలుగా లభించనున్న ఈ మాడల్ గరిష్ఠ ధర రూ.9.99 లక్షలు. స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, రియర్ ఏసీ వెంట్స్, డిజిటల్ క్లస్టర్, ఏడు స్పీకర్ సౌండ్ సిస్టమ్, 25.55 సెంటీమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, రియర్ పార్కింగ్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి. 15 ఏండ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన ఈ ఐ20 కార్లు దేశవ్యాప్తంగా 11 లక్షలు అమ్ముడయ్యాయి.

## యూకో బ్యాంక్ మాజీ సీఎండీ గోయల్ అరెస్టు

### రూ.6,210 కోట్ల మనీలాండరింగ్ కేసులో అదుపులోకి..



న్యూఢిల్లీ, మే 19: మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం వెల్లడించింది. గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్నప్పుడు కోల్‌కతా కేంద్రంగా పనిచేస్తున్న కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (సీఎస్‌పీఎల్) కంపెనీకి భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసిన వ్యవహారంలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇలా మంజూరైన రుణాల్లో రూ.6,210.72 కోట్లను సీఎస్‌పీఎల్ కంపెనీ దుర్వినియోగం చేసినట్టు ఇప్పటికే సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గోయల్, అతని కుటుంబ సభ్యుల నియంత్రణలోని షెల్, డమ్మీ కంపెనీలకు నిధులను మళ్లించినట్టు సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు గత ఏప్రిల్‌లో గోయల్‌తోపాటు పలువురు ఇండ్లలో దాడులు నిర్వహించారు. ఈ నెల 16న గోయల్‌ను అరెస్టు చేసి, స్పెషల్ ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఈ నెల 21 వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. సీఎస్‌పీఎల్‌కు రుణాల మంజూరు వ్యవహారంలో గోయల్‌కు భారీ మొత్తంలో లబ్ధి చేకూరినట్టు ఈడీ పేర్కొన్నది. నగదు, స్థిరాస్థులు, విలాస వస్తువులు, హోటల్ బుకింగ్ తదితర రూపాల్లో షెల్ కంపెనీల ద్వారా గోయల్‌కు లబ్ధి చేకూరినట్టు వివరించింది.

## రికార్డు స్థాయికి ఫండ్ల ఆస్తులు

న్యూఢిల్లీ, మే 19: మ్యూచువల్ ఫండ్ ఆస్తులు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. 2024-25లో మ్యూచువల్ ఫండ్ ఆస్తుల విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.65.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ, డెబిట్ మార్కెట్లు నిరుత్సాహంగా ట్రేడవుతుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఫండ్లలోకి తరలించడం వల్లనే ఆస్తులు భారీగా పెరుగుతున్నాయని ఆంఫీ పేర్కొంది. మార్చి 2024 నాటికి ఫండ్ ఆస్తుల విలువ రూ.53.40 లక్షల కోట్లుగా ఉన్నది. ఫండ్లలో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య 5.67 కోట్లకు పెరిగారు. సిప్ పెట్టుబడులు 45.24 శాతం అధికమై రూ.2.89 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

## ఈసారి జీడీపీ అంచనాలు మిస్!

- క్యూ4లో 6.9%, 2024-25లో 6.3 శాతమే: ఇక్రా




న్యూఢిల్లీ, మే 19: దేశ జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో 6.9 శాతంగా నమోదు కావచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సోమవారం అంచనా వేసింది. ఈ క్రమంలోనే మొత్తం గత ఆర్థిక సంవత్సరం (2024-25) 6.3 శాతంగా ఉండొచ్చన్నది. అయితే జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) అంచనా కంటే ఇది తక్కువగా ఉండటం గమనార్హం. 2024-25కుగాను 6.5 శాతం జీడీపీ నమోదు కావచ్చని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్ఎస్‌వో అంచనా వేసిన విషయం తెలిసిందే. అయితే ఏప్రిల్-జూన్‌లో 6.5 శాతంగా, జూలై-సెప్టెంబర్‌లో 5.6 శాతంగా, అక్టోబర్-డిసెంబర్‌లో 6.2 శాతంగా జీడీపీ గణాంకాలున్నాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరానికిగాను ఎన్ఎస్‌వో అంచనా నిజం కావాలంటే.. ఈ జనవరి-మార్చిలో 7.6 శాతంగా జీడీపీ నమోదు కావాల్సిందే. కానీ ఇక్రా అంచనా 6.9 శాతంగానే ఉన్నది. ఈ క్రమంలోనే 2024-25లో దేశ జీడీపీని 6.3 శాతానికే పరిమితం చేసింది. కాగా, ఈ నెల 30న జనవరి-మార్చి త్రైమాసికంతోపాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ గణాంకాలను ఎన్ఎస్‌వో విడుదల చేయనున్నది. 2023-24లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.2 శాతంగా ఉన్న సంగతి విదితమే.

## 82 వేల దిగువకు సెన్సెక్స్

### ఐటీ షేర్లలో భారీగా అమ్మకాలు

ముంబై, మే 19: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టపోయాయి. అమెరికా రేటింగ్‌ను తగ్గిస్తూ మూడీస్ తీసుకున్న నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. దీంతోపాటు ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 271.17 పాయింట్లు నష్టపోయి 82,059.42 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 74.35 పాయింట్లు కోల్పోయి 24,945.45 వద్ద స్థిరపడింది. తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రారంభమైన సూచీలు చివరి వరకు బేరిష్ ట్రెండ్‌ను కొనసాగించాయి. మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, మహీంద్రా, టాటా మోటర్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఐటీసీ, మారుతి షేర్లు కోల్పోయాయి.
- కానీ, పవర్‌గ్రిడ్, బజాజ్‌ఫైనాన్స్, ఎన్టీపీసీ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్, హెచ్‌యూఎల్, టాటాస్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## ప్రజావాణి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



అర్జీలు స్వీకరించి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మం, మే 19 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని ఖమ్మం నగర మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడారు. వారు ఏ డివిజన్ నుంచి వచ్చారో, ఏ సమస్యను ఎదుర్కొంటున్నారో తెలుసుకుని సంబంధిత విభాగాలకు ఆయా దరఖాస్తులను పంపించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పౌరులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తుందని కమిషనర్ పేర్కొన్నారు.

**కార్యాలయాలు సౌకర్యంగా ఉండాలి**

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో పని నిర్వహణ సౌకర్యవంతంగా ఉండేందుకు, పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం కార్యాలయంలోని అన్ని విభాగాలను(సెక్షన్లను) ప్రత్యక్షంగా సందర్శించి సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతి సెక్షన్‌లో ఎవరు పని చేస్తున్నారు, వారు ఏ గదిలో కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు, అధికారులు కూర్చోడానికి తగినదిగా ఉందా లేదా అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు అసౌకర్యంగా మారుతున్న విధానాలను గుర్తించి, తక్షణమే మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులతో చర్చించారు. ప్రతి సెక్షన్‌కు ప్రత్యేకంగా గది కేటాయింపు చేసి ఆ సెక్షన్‌కు సంబంధించిన ఉద్యోగులంతా అదే గదిలో లేదా పరిసరాల్లో కూర్చోవాలన్నారు. ఇప్పటికే వేరే గదుల్లో కూర్చొన్న ఉద్యోగులు తక్షణమే వారికి కేటాయించిన గదుల్లోకి వెళ్లాలని ఆదేశించారు.

## తిరంగా ర్యాలీలో ఉద్రిక్తత

- ఖమ్మంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ..
- పరస్పర దాడులు.. పీఎస్‌లో ఫిర్యాదులు..
- ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మామిళ్లగూడెం, మే 19: ఆపరేషన్ సిందూర్ విజయవంతం పేరుతో భారత ఆర్మీని అభినందిస్తూ ఖమ్మం నగరంలో సోమవారం రాత్రి ఓ వర్గం చేసిన తిరంగా ర్యాలీ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ నుంచి పటేల్ స్టేడియం వరకు ఓ జాతీయ పార్టీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీలో స్టేడియం వైపు వస్తున్న క్రమంలో ఖమ్మం టూటౌన్ పోలీసు స్టేషన్ సమీపంలోని ఐటీ హబ్ సెంటర్ (ఇల్లెందు క్రాస్ రోడ్డు) వద్దకు చేరుకుంది. ర్యాలీ సందర్భంగా ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు అక్కడ బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో వారు ప్రాంతంలో ట్రాఫిక్‌ను నిలిపి వేశారు. అదే సమయంలో ఓ ఇద్దరు యువకులు తమ బైక్‌పై ర్యాలీని దాటి ముందుకెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వీరిని నిలువరించాడు. వారి వద్ద నుంచి బైక్ తాళం తీసుకున్నాడు. ప్రదర్శన అయిపోయేంత వరకు పక్కనే నిలుచోవాలని సూచించారు. అయితే, ఆ ఇద్దరు యువకులు ర్యాలీని దాటుకొని రావడాన్ని గమనించిన ర్యాలీలోని కొందరు యువకులు.. ఆ ఇద్దరు యువకుల వద్దకు చేరుకున్నారు. ర్యాలీ జరుగుతుండగా దానిని దాటుకొని ఎలా వస్తావరంటూ ఆ ఇద్దరు యువకులను ప్రశ్నిస్తూ వారు కూర్చున్న బైకును వెనక్కు లాగారు. దీంతో ఆ ఇద్దరు యువకులు కిందపడ్డారు. దీంతో ఆ ఇద్దరు యువకులు కూడా తమను కిందపడేసిన యువకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ర్యాలీని దాటుకొని వచ్చిన ఇద్దరు యువకులు పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సరిగ్గా ఇదే సమయంలో.. ర్యాలీలోని యువకులు మమ్ములను కిందపడేశారు. పోలీసులు మమ్ములను అరెస్టు చేశారు' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీంతో ఆ ఇద్దరు యువకుల వర్గీయులు పెద్ద సంఖ్యలో టూటౌన్ పీఎస్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. తమ వారిని కింద పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఇంతలో తిరంగా ర్యాలీ బాధ్యులు కూడా స్టేడియంలో వేడుకలు ముగించుకొని టూటౌన్ స్టేషన్ ఎదురుగుండా వెళ్తున్నారు. ఇక్కడ రెండు వర్గాల వారూ ఎదురుపడి ఘర్షణకు, పరస్పర దాడులకు దిగారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీతో ఇరు వర్గాలనూ చెదరగొట్టారు. ఇరు వర్గాలనూ అదుపులోకి తీసుకున్నారు. రెండు వర్గాల వారూ పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు వాటిని స్వీకరించారు. నిందితులను శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఇరు వర్గాల వారూ శాంతించారు. కాగా, ఈ ఘటన నేపథ్యంలో మంగళవారం ఖమ్మం నగర బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. ఈ బంద్‌లో పాల్గొనేందుకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రానున్నట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు.

## ఆయిల్‌ఫెడ్ ప్రక్షాళన ప్రారంభం!

- డిప్యుటేషన్‌పై ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓపీడీ మేజర్ల నియామకం
- ఎంపీ వద్దిరాజు కృషితో ప్రక్షాళన దిశగా అడుగులు





కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు, పామాయిల్ తోట (ఫైల్)

దమ్మపేటరూరల్, మే 18 : అవినీతికి మారుపేరుగా పేరుగాంచిన తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ప్రక్షాళనకు అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఆయిల్‌ఫెడ్ పరిధిలోని రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్న హాఫ్‌టైప్ మొక్కలు, ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో సమస్యలు వ్యవసాయశాఖ మంత్రి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉద్యానశాఖ సంచాలకులు, ఆయిల్‌ఫెడ్ ఎండీలకు తలనొప్పిగా మారాయి. ఇప్పటివరకు ఆయిల్‌పాం ప్లాంటేషన్, ప్రాసెసింగ్‌లకు పూర్తిగా ఆయిల్‌ఫెడ్‌లోని అధికారులపైనే ఆధారపడ్డారు. ఆయిల్‌ఫెడ్‌లోని ఉన్నత స్థాయిలో ఉన్న కొంతమంది అధికారులు తమను తప్పుదోవ పట్టిస్తున్నారని భావించి తప్పనిసరి పరిస్థితిల్లో ఆయిల్‌ఫెడ్‌ను ప్రక్షాళన చేయకతప్పడం లేదని తెలుస్తోంది.

**హాఫ్‌టైప్ మొక్కల ప్రభావం...**

రాష్ట్రం 1993లో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ సాగు ప్రారంభం అయినప్పటికీ 2016 నుంచి 2022 వరకు హాఫ్‌టైప్ మొక్కలు గణనీయంగా రైతుల వ్యవసాయ క్షేత్రాలకు చేరాయి. రైతులు ఆరుగాలం కష్టించి ఆరేడేళ్లు పెంచిన తోటల్లో హాఫ్‌టైప్ చెట్ల నుంచి పూర్తిగా గెలలు రావడం లేదు. మరికొన్నింటి నుంచి సగటున సంవత్సరానికి 250-300 కిలోల గెలలు ఉత్పత్తి రావాల్సిన స్థానంలో 40-50 కేజీలకు మించి రావడం లేదు. దీని ప్రభావం రైతులపై తీవ్రంగా పడింది. ఈ బాధిత రైతుల సంఖ్య వందల్లోనూ, వేల ఎకరాల్లోనూ ఉంది. రోజురోజుకూ హాఫ్‌టైప్ మొక్కల బాధిత రైతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ సమస్యపై రైతుల నుంచి నిరసనలు, ఆందోళనలు, పరిహారం కోసం వినతులు, కోర్టుల్లో కేసులు తీవ్రమయ్యాయి. దీనికి కారణాలను శోధిస్తే ఆయిల్‌ఫెడ్‌లోని కొంతమంది అధికారుల మితిమీరిన అవినీతి అని తెలుస్తోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు, ఆయిల్‌ఫెడ్‌లో అసలేం జరుగుతుందో తెలుసుకునేందుకు వేరే ప్రభుత్వశాఖల నుంచి డిప్యుటేషన్‌పై అధికారులను నియమించారు. దీనిలో భాగంగా ఓపీడీ(ఆయిల్‌పాం ప్లాంటేషన్ డెవలప్‌మెంట్) మేనేజర్‌గా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీలో ఉద్యాన ప్రిన్సిపల్ సైంటిస్టుగా పని చేస్తున్న డాక్టర్ అడపా కిరణ్‌కుమార్‌ను నియమించారు.

**వెంటాడుతున్న పలు సమస్యలు...**

అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల్లో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. 2023-24 ఆయిల్ ఇయర్ ముగిసిన తరువాత అశ్వారావుపేటలో 68 మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ నిల్వ ఉన్నట్లు బహిర్గతమైంది. ఆయిల్‌పాం యాక్టు ప్రకారం దీనిలో 75.25 శాతం వాటా రైతులకు చేరాల్సి ఉంది. దీనిని లెక్కించకుండానే 2024-25 ఆయిల్ ఇయర్‌కు ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్(ఓఈఆర్) లెక్కించారు. ఇటువంటి అనేక రైతాంగ వ్యతిరేక చర్యలతో రైతు సంఘాల నిరసనలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఇక మీదట ఇటువంటి సమస్యలకు తావియ్యకూడదని తెలంగాణ ఇండస్ట్రీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రశాంత్ కుమార్‌ను డిప్యుటేషన్‌పై ఆయిల్‌ఫెడ్‌లో కొత్తగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) పోస్టు ఏర్పాటు చేసి నియమించారు. ఇప్పటివరకు ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తరువాతి స్థానమైన జనరల్ మేనేజర్ స్థానానికి పైన ఈడీని నియమించారు.

**మార్కెటింగ్ విభాగంలో..**

తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌లో మార్కెటింగ్ కీలకమైన విభాగం. ఆయిల్‌ఫెడ్‌కు అశ్వారావుపేట, అప్పారావుపేటల్లో పామాయిల్ ఫ్యాక్టరీల నుంచి సుమారు 60 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి జరుగుతుంది. ఉప ఉత్పత్తుల నుంచి పామ్ కెర్నల్ ఆయిల్, కేక్, డీ-మక్కు వంటి పలు ఉత్పత్తులు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు క్రూడ్ పామాయిల్‌ను అమ్మి తిరిగి రిఫైన్డ్ పామాయిల్, వేరుశనగ, రైస్ బ్రాన్ వంటి వంట నూనెలను కొని ప్యాకింగ్ చేసి 'విజయ' బ్రాండ్‌తో ఆయిల్‌ఫెడ్ మార్కెటింగ్ చేస్తున్నది. హైదరాబాద్‌లో శివరామ్‌పల్లిలో ప్యాకింగ్ యూనిట్ సైతం ఆయిల్‌ఫెడ్‌కు ఉంది. ఆయిల్‌ఫెడ్ వార్షిక టర్నోవర్ సుమారు వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇంత కీలకమైన మార్కెటింగ్ విభాగానికి సైతం డిప్యుటేషన్‌పై నిపుణుడిని నియమిస్తే ఆయిల్‌ఫెడ్‌ను మరింత వేగంగా ప్రక్షాళన చేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఎంపీ వద్దిరాజు చొరవతో ప్రక్షాళన!**

ఆయిల్‌ఫెడ్ పరిధిలో హాఫ్‌టైప్ మొక్కలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పామాయిల్ ప్రాసెసింగ్‌లో సమస్యలు ఉన్నాయని, అవినీతి జరుగుతోందని, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ నాయకులు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో ఇచ్చిన ఆ వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలన్నీ నిజాలు కావడంతో ప్రక్షాళన ప్రారంభమైనట్లు తెలుస్తోంది.

## ఎంవీ పాలేన్ని.. మండల కేంద్రంగా ప్రకటించాలి

- సాధన సమితిగా ఏర్పడిన అఖిలపక్ష నాయకులు
- పొరుగు గ్రామాల మద్దతుకు జోరుగా ప్రచారం



కాచిరాజుగూడెం గ్రామస్తులతో సమావేశమైన ఎంవీ పాలెం గ్రామస్తులు


ఖమ్మం రూరల్, మే 19: ఖమ్మం మండలంలోని ఎం.వెంకటాయపాలెం (ఎంవీ పాలెం) గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్ మరోమారు తెరపైకి వచ్చింది. గడిచిన రెండు మూడు రోజుల నుంచి ఎంవీ పాలేనికి చెందిన ఆయా రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చి వరుస సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. 'ఎం వెంకటాయపాలెం మండల సాధన సమితి'ని ప్రకటించుకొని కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఖమ్మం రూరల్ మండల విభజనకు ప్రాథమిక ప్రకియ జరిగింది. అధికారులు బ్లూప్రింట్‌ను కూడా సిద్ధం చేశారు. ఆ తరువాత కొద్ది రోజులకే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నూతన మండల ఏర్పాటు ప్రక్రియ ఆగిపోయింది. అయితే నూతనంగా కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత.. ఎంవీ పాలెంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు నిమిత్తం జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. తరువాత కొద్ది రోజులకే ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటైంది. దీంతో తమ గ్రామం కేంద్రంగా నూతన మండల కేంద్రం కూడా లాంఛనమేనని ఆ గ్రామంతో పరిసర గ్రామాల ప్రజలు అభిప్రాయానికి వచ్చారు. కానీ ప్రభుత్వం నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. అయితే, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఖమ్మం రూరల్ ఎంపీడీవో కార్యాలయం, ఖమ్మం త్రీటౌన్ పరిధిలో ఖమమం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఉండి ఖమ్మం రూరల్ ప్రజలకు సేవలందిస్తున్నాయి.

**సాధన సమితి పేరుతో ప్రత్యేక కార్యాచరణ**

మండల కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ వైద్యశాల, అనువైన ప్రభుత్వ స్థలాలు, అధిక జనాభా వంటి వివిధ సౌలభ్యాలు ఉన్నందున తమ గ్రామానిక మండల కేంద్రం చేయాలని ఎంవీ పాలెం వాసులు కోరుతున్నారు. ఈ మేరకు సాధన సమితి పేరుతో జేఏసీగా ఏర్పడి కార్యాచరణ ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు తమ గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని ఆ గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా సాధన సమితి నాయకులంతా ఏకమై కాచిరాజుగూడెం, కస్నాతండా గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఎంవీ పాలెం మండల కేంద్రం అయితే కలిగే ప్రయోజాలను వివరిస్తున్నారు.

## నేటినుంచి టీచర్లకు రెండోవిడత శిక్షణ

### జిల్లాస్థాయిలో మూడు సెంటర్లు



మాట్లాడుతున్న డీఈవో సత్యనారాయణ

ఖమ్మం అర్బన్, మే 19 : ఉపాధ్యాయులకు రెండో విడత శిక్షణ తరగతులు ఈ నెల 20వ తేదీ మంగళవారం ప్రారంభంకానున్నాయి. ఈ నెల 24వ తేదీ వరకు ఐదురోజులపాటు కొనసాగనున్నాయి. మొదటి విడత శిక్షణ తరగతులు ఈ నెల 13 నుంచి ఈ నెల 17వరకు జరిగిన విషయం తెలిసిందే. రెండో విడతలో భాగంగా మూడు సెంటర్లలో జిల్లాస్థాయి శిక్షణ, 21 సెంటర్లలో మండలస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. మండలస్థాయి శిక్షణ ఆయా ఎంఈవోలు కోర్సు డైరెక్టర్లుగా ఒకే స్పెల్‌లో జరగనుంది. ఐదురోజుల శిక్షణకు ఆయా మండలంలో పనిచేస్తున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, ఎస్జీటీలు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంది. వారికి ప్రతి మండలం నుంచి జిల్లాలో శిక్షణ పొందిన 8మంది ఆర్పీలు శిక్షణ కల్పించనున్నారు. రిసోర్స్‌పర్సన్‌లతో డీఈవో సామినేని సత్యనారాయణ సోమవారం సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. హార్వెస్ట్ పాఠశాలలో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు సెంటర్ ఇన్‌చార్జిగా ప్రధానోపాధ్యాయుడు కె గాయత్రి వ్యవహరించనున్నారు. న్యూఇరా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు సెంటర్ ఇన్‌చార్జ్‌గా ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ వ్యవహరించనున్నారు. న్యూవిజన్ పాఠశాలలో భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు సెంటర్ ఇన్‌చార్జిగా కమ్యూనిటీ మొబలైజషన్ ఆఫీసర్ వై రాజశేఖర్ వ్యవహరించనున్నారు.

**శిక్షణకు తప్పనిసరి హాజరుకావాలి..**

శిక్షణకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని డీఈవో సామినేని సత్యనారాయణ అన్నారు. ఎవరికీ మినహాయింపు లేదని, ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న సబ్జెక్ట్ పాఠ్యపుస్తకాలు, కరదీపికలతో హాజరుకావాలని సూచించారు. జియో టాగింగ్ ద్వారా యాప్‌లో హాజరు నమోదు ఉంటుందని, ఐదురోజులపాటు ఐదు అంశాలపై శిక్షణ కల్పిస్తారని తెలిపారు.